శిథిలావస్థలో సర్కారు భవనాలు

వరదయ్యపాళెం మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. పట్టించుకునేవారు లేక నిరుపయోగంగా మారిపోయాయి. మరమ్మతులకు నోచుకోక దిష్టిబొమ్మల్లా తయారయ్యాయి. ఈ క్రమంలోనే పలు కార్యాలయాలు మాత్రం అద్దె భవంతుల్లోనే కొనసాగుతున్నాయి. రూ.లక్షల ప్రజా ధనం వృథా అవుతున్నా.. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. సర్కారు భవనాలను బాగు చేయించకుండా ప్రజా ప్రతినిధులు సైతం నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు.

- మరమ్మతు చేయించని అధికారులు
- అద్దె గృహాల్లో కార్యాలయాలు



వాడుకలో లేని కదూరు సహకార సొసైటీ భవనం

వరదయ్యపాళెం : మండలంలోని తెలుగుగంగ, సింగిల్ విండో సహకార సొసైటీ, అటవీశాఖకు చెందిన పలు భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాటిని బాగుచేయించాలనే ఉద్దేశం ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులకు కరువైంది. చాలా కార్యాలయాలు సొంత భవనాలు లేక అద్దె కొంపల్లో కాలం వెల్లదీస్తున్నా.. ఉన్నవాటిని మాత్రం బాగుచేయడం లేదు. శిథిల భవనాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తెస్తే ప్రభుత్వానికి అద్దెలు కూడా మిగులుతాయి. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

- కదూరు సహకార సింగిల్ విండోకి సంబంధించి కదూరు, సంతవేలూరు, బత్తలవల్లం, చిన్నపాండూరు ప్రాంతాల్లోని భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నిచోట్ల అనధికారికంగా భవనాలను కొందరు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. అయితే అద్దె భవనంలోనే సంబంధిత కార్యాలయం నడిపిస్తున్నారు.
- చిన్నపాండూరు, వరదయ్యపాళెంలోని ఇందిరా కాలనీ వద్ద గతంలో తెలుగుగంగ కార్యాలయాలు ఉండేవి. అయితే ప్రస్తుతం రెండు ప్రాంతాలలో కూడా తెలుగుగంగ శాఖకు సంబంధించి కార్యకలాపాలు జరగకపోవడంతో కొన్నేళ్ల క్రితం రెండు కార్యాలయాలు మూతపడ్డాయి. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాల్లో ఉన్న సిబ్బంది క్వార్టర్స్ అయితే శిథిల దశకు చేరుకున్నాయి.
- ఉబ్బలమడుగు సీబీఈటీ పర్యాటక కేంద్రానికి చెందిన అటవీ అతిథిభవనాలు వసతుల లేమితో నిరుపయోగంగా మారాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు రాత్రివేళల్లో బస చేసేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది.





వరదయ్యపాళెంలో నిరుపయోగంగా ఉన్న తెలుగుగంగ సహాయ ఇంజినీర్ కార్యాలయం, చిన్నపాండూరులోని తెలుగుగంగ గోదాములు, మూతపడిన ఉబ్బలమడుగు సీబీఈటీ భవనాలు

క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వరదయ్యపాళెం : స్థానిక నైస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం సహకారంతో శనివారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ క్రమంలోనే పింక్ బస్ ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.మోహన్, స్విమ్స్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మునస్వామి, వైద్యులు చైతన్య భాను, తహసీల్దార్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి

నారాయణవనం: మండలంలో నిర్మిస్తున్న పశువుల నీటి తొట్లు, ఫారం పాండ్ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. శనివారం మండలంలో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో మూగజీవులకు దాహాన్ని తీర్చడానికి నీటి తొట్లు అవసరాన్ని గుర్తించి ఈ నెల చివరికి పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలకు ముందే ఫారంపాండ్ల పనులను పూర్తి చేయించాలని సూచించారు. అనంతరం మామిడి, పూలమొక్కల పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకంలో లబ్ధి పొందే రైతుల సంఖ్యను పెంచుతూ ఉద్యానవన, పళ్ల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఏపీఎం మమత, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలకు వితరణగా 20 కంప్యూటర్లు



కంప్యూటర్లతో విద్యార్థులు, అధికారులు, దాత

సత్యవేడు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి, సత్యవేడు మండలం రాజగుంట గ్రామానికి చెందిన బాలచంద్రారెడ్డి 20 కంప్యూటర్లను వితరణగా శనివారం అందజేశారు. వీటూ హెల్ప్ సంస్థ (హైదరాబాదు) ద్వారా కంప్యూటర్లను పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్ రాజు, ఎంఈఓ కె.రవి సమక్షంలో హెచ్ఎం భారతికి అందించారు. బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శాంతకుమార్, సోమశేఖర్, ఉపాధ్యాయులు మనోహరుడు, పాండురంగయ్య, వైవీఎల్ కుమార్, పీడీ మురళి, కృష్ణయ్య, సుబ్బారాయుడు, టి. సురేఖ, బి. శ్రీదేవి, బాలాజీ, కార్తీక్ పాల్గొన్నారు.

గిరిజనులకు తీరిన దాహార్తి

సాక్షి ఎఫెక్ట్..



తాగునీరు పట్టుకుంటున్న గిరిజనులు

బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని వీఎస్ పురం పంచాయతీ అరిగిల కండ్రిగ గిరిజన కాలనీలో స్థానికుల దాహార్తి ఎట్టకేలకు తీరింది. శనివారం గిరిజన కాలనీలో దాహం కేకలు శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ సిద్ధమ్మ స్పందించారు. వెంటనే మోటారుకు మరమ్మతులు చేయించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దాహార్తిని తీర్చడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



అమ్మవారి చిత్రపటాలతో నూకతోటి రాజేష్

సత్యవేడు : మండలంలోని పీవీపురంలో శనివారం గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, జిల్లా కార్మిక విభాగం మాజీ అధ్యక్షుడు బీరేంద్రవర్మ, భాను ప్రకాష్ రెడ్డి, నేతలు కె.సుశీల్‌కుమార్ రెడ్డి, కేవీ నిరంజన్ రెడ్డి, సర్పంచ్ రమేష్ పాల్గొని గంగమ్మకు ప్రత్యేక పూజలు జరిపించారు. నేతలకు అమ్మవారి చిత్ర పటాలను నిర్వాహకులు అందించారు. ఆలయ అభివృద్ధికి బీరేంద్రవర్మ రూ. 50వేల విరాళంఅందజేశారు.

తొట్టంబేడు ఇన్‌చార్జి ఎస్‌ఐగా విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ : తొట్టంబేడు ఇన్‌చార్జి ఎస్‌ఐగా శనివారం బీఎన్ కండ్రిగ ఎస్‌ఐ విశ్వనాథనాయుడు అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఈశ్వరయ్య తిరుపతి వీఆర్‌కు బదిలీపై వెళ్లారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రామసేతు వంతెన వద్ద గల గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ఆయన వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంక్షేమ సంఘం నాయకులు, జిల్లా ఈడిగ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తంగౌడ్, మోహన్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, దుర్గాప్రసాద్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎర్రగుడిపాడులోనే నిర్వహించాలి



ఎంఈవోకు వినతిపత్రమిస్తున్న ఎస్ఎంసీ సభ్యులు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడు గ్రామంలోనే ప్రాథమిక పాఠశాలను ఐదు తరగతుల వరకు నిర్వహించాలని, ఎస్ఎంసీ చైర్మన్ గురవమ్మ విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి శనివారం ఎంఈవో భువనేశ్వరికి వినతిపత్రాన్ని అందించారు. ఇక్కడ 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థులను మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న ముచ్చివోలుకు తరలించడం తగదన్నారు. విద్యార్థులు ఆ పాఠశాలకు వెళ్లాలంటే ప్రమాదకరమైన చెరువు గట్టు మీద ఒకటిన్నర కిలోమీటరు నడిచి వెళ్లాల్సి ఉందని వివరించారు. కార్యక్రమంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కన్వీనర్ చంద్రశేఖర్, కో- కన్వీనర్ రామచంద్రయ్య, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు శేఖర్, గంగాధర్, లతా, జ్యోతి ,లలిత, రంగమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: కేవీబీపురం మండలం ఎస్ఎల్ పురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ విభాగం జిల్లా కార్యదర్శి రమణ తండ్రి దామోదరం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ వెంటనే గ్రామానికి చేరుకుని దామోదర్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమణ, కుటుంబీకులను పరామర్శించారు. నేతలు గవర్ల కృష్ణయ్య, లాల్‌బాబు యాదవ్, మణి, రామ్మోహన్ వర్మ, స్థానిక అయ్యప్ప రెడ్డి, గిరిబాబు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

శ్రీకాళహస్తి: దేశంలో ముస్లింలకు అన్యాయం చేసే వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం, నల్ల చట్టాలను రద్దు చేయాలని శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వామపక్ష నాయకులు, ముస్లిం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే విధంగా ప్రయత్నిస్తోందన్నారు. ముస్లింలు, దళితులు నల్ల చట్టాలను రద్దు చేసే వారకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సిరాజ్‌బాషా, నాయకులు పఠాన్ ఫరీద్, గోరా, లాలు, షేక్ అస్లాం, లాల్‌బాషా, నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, పసల కృష్ణయ్య, సీపీఎం, సీపీఐ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బడిలో చేర్పించాలని ప్రచారం

వరదయ్యపాళెం: బడిఈడు పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరాలని కేవీబీపురం మండల ఎంపీడీఓ రాధారాణి, ఎంఈఓ లక్ష్మీపతి కోరారు. శనివారం ఈ మేరకు ఆరె, కేవీబీపురం, సీఆర్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఐదేళ్లు నిండిన వారు సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, అలాగే ఐదో తరగతి పూర్తి చేసుకున్న వారు ఉన్నత పాఠశాలలో చేరాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో దిగువ పుత్తూరులో 16 మంది, శ్రీనివాసపురం -16 మంది, అలత్తూరు హరిజనవాడ -9 మంది విద్యార్థులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి తగ్గింపుపై ఆగ్రహం

నారాయణవనం: మండలంలోని కీలగరం ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమి స్థాయికి తగ్గించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మరింతగా స్థాయి తగ్గించడం దారుణమని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారుల నిర్ణయంతో సుమారు 76 మంది విద్యార్థులు నారాయణవనంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీంతో పలువురు పిల్లలకు బడికి దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించి కీలగరం పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ గుణశేఖర్‌కు వినతిపత్రం అందించారు.

చలివేంద్రం ప్రారంభం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సమీపంలోని కేఎల్ఎం హాస్పిటల్ కూడలి వద్ద శనివారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విద్యార్థుల చేతుల మీదుగా తిరుపతి జిల్లా అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ చారి ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన ఎస్ఐ సుధాకర్, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు మురళీకృష్ణ, శరత్ చంద్ర, జయచంద్ర, ఎస్ఐలు సుధాకర్, అరుణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డ క్షేమం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని సూపర్ వైజర్ అనంతలక్ష్మి అన్నారు. రేణిగుంట పంచాయతీలో శనివారం పోషణ్ పఖ్వాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఏఎన్ఎంలు లోహిత, విజయలక్ష్మి, ఆశా వర్కర్ శ్రీదేవి, ఎంఎస్‌కేలు పూర్ణిమ, అమల, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనమ్మ, అంబిక, రేవతి, గర్భవతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు



దీక్ష విరమింపజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడులో అర్హులైన దళితులందరికీ ఇంటి స్థలాలు ఇప్పిస్తామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇంటి పట్టాల కోసం గత 39 రోజులుగా దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరానికి ఎమ్మెల్యే ఆదిమూలం, తహసీల్దారు శ్రీదేవి శనివారం వచ్చి మాట్లాడారు. ఇంటి పట్టాలు ఇప్పిస్తామని భరోసా ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

అభయ క్షేత్రంలో అన్నదానం



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా శనివారం రేణిగుంటలోని అభయ క్షేత్రంలో గౌడ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల చెంగయ్య గౌడ్, తిరుపతి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తిరకాల వెంకటముని బాబు గౌడ్, బాబుగౌడ్, యార్లపల్లి గిపి గౌడ్, చిరంజీవి గౌడ్, చిట్టెం శ్రీధర్ గౌడ్, బాబు గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత



వరదయ్యపాళెంలో ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు, ప్రజలు



బీఎన్ కండ్రిగలో ర్యాలీ చేస్తున్న అధికారులు



నాగలాపురంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

వరదయ్యపాళెం: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో అందరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులతో కలసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ రాజశేఖర్, ఈఓపీఆర్‌డీ చిరంజీవి, పంచాయతీ ఈఓ బసిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్, నేతలుసురేష్ రెడ్డి, శివయ్య, దశరథన్, కోటి పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అలాగే బీసీ హాస్టల్ వార్డన్ రామయ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, తహసీల్దారు శ్రీదేవి, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, వైద్యాధికారి విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగలాపురం: సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీడీఓ బాలాజీనాయక్, కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈఓపీఆర్‌డీ నాగరత్నమ్మ, ఏపీఓ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ-వేస్ట్ సేకరించారు. కార్యక్రమంలో ఏడీ రమేష్, సిబ్బంది జగదీష్, రాజేష్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీని మూడు రోడ్ల కూడలి వద్ద నిర్వహించారు. తిరుపతి అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తహసీల్దార్ భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ జయచంద్ర పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

స్వచ్ఛాంధ్రపై అవగాహన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం సర్పంచ్ ఈశ్వరమ్మ అధ్యక్షతన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పై గ్రామసభను నిర్వహించారు. డీఎల్‌పీఓ ప్రభు రెడ్డి స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈవో రమేష్ బాబు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన





స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని అమర రాజా ఎనర్జీ, మొబిలిటీ లిమిటెడ్ కర్మాగారంలో ఈ వేస్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీన్ని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్ నరపురెడ్డి మౌర్య ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో నిర్వహించే ఈ-వేస్ట్ నిర్వహణ పద్ధతులు గృహ స్థాయిలోని ఈ-వేస్ట్ సేకరణ కంటే మెరుగ్గా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఏపీపీసీబీ ఎస్‌సి మురళి, ఈఈ రాజశేఖర్, అమర్ రాజా సంస్థ సీఓఓ నరసింహులు నాయుడు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే స్వచ్ఛాంధ్ర

ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే స్వచ్ఛాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుందని తిరుపతి జిల్లా అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ చారి అన్నారు. రేణిగుంట పంచాయతీ బిస్మిల్లా నగర్‌లో ఈవో మణి, సర్పంచ్ నగేషం ఆధ్వర్యంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ప్రభు రావు పాల్గొని కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ స్వయంగా చెత్త తీసుకెళ్లి బండిలో వేశారు. కార్యక్రమంలో గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

శ్రీకాళహస్తి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు అవుదామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని భాస్కరపేట పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఒకటో పట్టణ సీఐ గోపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు పరిసరాలను శుభ్రం చేశారు.

ఏర్పేడు: ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ భార్గవి, గ్రామసభలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ ప్రభురెడ్డి, ఈ వేస్ట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ మౌర్య, చెత్తను తరలిస్తున్న ఏఎస్పీ